తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
కరీంనగర్ - నిజామాబాద్
రాజన్న సిరిసిల్ల | కామారెడ్డి
పెద్దపల్లి | జగిత్యాల
సోమవారం
01 జూన్ 2026
పేజీలు : 8
Follow :

# బస్ డిపో పనులను వేగవంతం చేసి త్వరలో ప్రారంభిస్తాం

- ప్రజల అవసరాలకు అనుగుణంగా కొత్త ఆర్టీసీ బస్సుల కొనుగోలు
- ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- పెద్దపల్లి బస్ డిపో స్థలాన్ని పరిశీలించిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**పెద్దపల్లి,మే 31(జనంసాక్షి) :**
పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయనున్న ఆర్టీసీ బస్ డిపో పనులను వేగవంతం చేసి త్వరలోనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రతిపాదిత బస్ డిపో స్థలాన్ని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్ విజయ రమణారావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ విప్ విజయ రమణారావు, సీనియర్ మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి పెద్దపల్లికి ఆర్టీసీ బస్ డిపోను మంజూరు చేశారని తెలిపారు. బస్ డిపో పనులు కొంత ఆలస్యమైనప్పటికీ ప్రస్తుతం వాటిని వేగవంతం చేసి త్వరలో ప్రారంభించేందుకు చర్యలు చేపట్టామని మంత్రి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలకు బస్సు కనెక్టివిటీని మరింత మెరుగుపరిచే దిశగా చర్యలు తీసుకుంటున్నామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అమల్లోకి వచ్చిన తర్వాత గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడపాలనే డిమాండ్ పెరిగిందని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా కొత్త ఆర్టీసీ బస్సుల కొనుగోలు ప్రక్రియ కూడా కొనసాగుతోందని, ప్రజా రవాణా వ్యవస్థలో ఆర్టీసీని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులకు సంబంధించిన అన్ని సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కార్మికులకు ఉన్న అపోహలను తొలగించుకోవాలని సూచించారు. ఉప ముఖ్యమంత్రి నాయకత్వంలో ఐదుగురు మంత్రులు, సీనియర్ అధికారులు, 40 మంది ఆర్టీసీ ప్రతినిధులతో చర్చలు జరిపి కార్మికులకు 11 శాతం పీఆర్సీ మంజూరు చేసినట్లు తెలిపారు. ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికలు త్వరలో నిర్వహించనున్నామని, ఎన్నికైన ప్రతినిధులతో చర్చించి భవిష్యత్తులో ఆర్టీసీ విలీన ప్రక్రియను చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. విలీన ప్రక్రియలో ఎలాంటి వివాదాలు, అడ్డంకులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని, కార్మికులు అనవసర ఆందోళన చెందవద్దని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య, పలువురు కౌన్సిలర్లు, ఆర్టీసీ మేనేజర్ రామ్ గోపాల్ రెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకులు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





## అంజన్న సేవలో పెద్దపల్లి కలెక్టర్

**మల్యాల మే 31 (జనంసాక్షి)**
తెలంగాణ లోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ కొండగట్టు ఆంజనేయ స్వామిని ఆదివారం పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష కుటుంబ సమేతంగా దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు అర్చకులు కలెక్టర్ కు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ స్థానాచారి కపిందర్ కలెక్టర్ కు శేష వస్త్రం కప్పి స్వామివారి ప్రసాదాన్ని అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ టెంపుల్ ఇన్స్పెక్టర్ చెక్కిళ్ళ అశోక్,ఏఎస్సై చిలుక శ్రీనివాస్,ఆర్ఐ తిరుపతి ఉన్నారు.



## పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించిన పెద్ద వాల్గోట్ గ్రామస్థులు

**సిరికొండ, మే 31 (జనంసాక్షి):**
సిరికొండ మండలంలోని పెద్ద వాల్గోట్ గ్రామంలో ఆదివారం పోచమ్మ అమ్మవారి బోనాల వేడుకలను గ్రామస్థులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా పోచమ్మ దేవాలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వనిత నర్సింగ్, ఉప సర్పంచ్ రాము, వీడీసీ చైర్మన్ సాగర్ రెడ్డి, వార్డు సభ్యులు, కమిటీ సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం గ్రామ పెద్దలు మాట్లాడుతూ పోచమ్మ బోనాలు గ్రామ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం ఇదే విధంగా గ్రామ ప్రజల సహకారంతో బోనాల వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.



## టీ ఎన్జీవోల ఆధ్వర్యంలో ఘనంగా ఉద్యోగ విరమణ సన్మాన మహోత్సవం



**కరీంనగర్ బ్యూరో, మే 31 (జనంసాక్షి) :**
తెలంగాణ ఎన్జీవోల సంఘం కరీంనగర్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ శాఖ ల్లో సుదీర్ఘకాలం పాటు ప్రజాసేవలో విశిష్ట సేవలందించి పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు ఘనంగా ఉద్యోగ విరమణ సన్మాన మహోత్సవం నిర్వహించారు. టీ ఎన్జీవోల జిల్లా అధ్యక్షులు, ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర టీ ఎన్జీవోల అధ్యక్షులు, ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖలో సూపరింటెండెంట్ గా సేవలందించి పదవీ విరమణ పొందిన చింతలపల్లి రాజు రెడ్డి రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించి, ఉద్యోగ జీవిత అనుభవాలను సమాజానికి ఉపయోగపడే విధంగా పుస్తక రూపంలో అందించడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం చింతలపల్లి రాజు రెడ్డి, ఇరిగేషన్ శాఖకు చెందిన ఒంటెల వెంకటరెడ్డి, రవీందర్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మారం జగదీశ్వర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సహజమైన ప్రక్రియ అయినప్పటికీ వారు ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని అన్నారు. ఉద్యోగులు, పెన్షనర్ల సంక్షేమం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. ఉద్యోగుల హెల్త్ కార్డుల అమలు పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల బకాయిల చెల్లింపుల విషయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తూ, ముందుకు సాగుతోందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, డీఏల అంశాల పై ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకుంటుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లి ప్రభుత్వానికి మరింత మంచి పేరు తీసుకురావాలని ఉద్యోగులకు పిలుపునిచ్చారు. కొద్దిమంది చేస్తున్న తప్పిదాల వల్ల యావత్ ఉద్యోగ వ్యవస్థకు చెడ్డపేరు వస్తోందని, ఉద్యోగులు నీతి, నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహించి ప్రభుత్వానికి, ప్రజలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అవినీతి చర్యలకు దూరంగా ఉండి కుటుంబాల గౌరవాన్ని కాపాడు కోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమం లో జిల్లా కార్యదర్శి సంఘం లక్ష్మణరావు, టీజీవోల జిల్లా అధ్యక్షుడు మడిపల్లి కాళీచరణ్, టీఎన్జీవోల జిల్లా కోశాధికారి ముప్పిడి కిరణ్ కుమార్ రెడ్డి, రాగి శ్రీనివాస్, సర్దార్ హర్మిందర్ సింగ్ సురేష్, మామిడి రమేష్, పోల్ కిషన్, గోవిందపతి శ్రీనివాస్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కోట రామస్వామి, నాగభూషణం, సందీప్, అస్గర్ తదితర ఉద్యోగ సంఘ నాయకులు, ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించిన కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థిని



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మే 31 (జనంసాక్షి):**
కరీంనగర్లో శనివారం ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యం లో నిర్వహించిన ఉమ్మడి జిల్లా బ్లాక్ బెల్ట్ కరాటే గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు.ఈ పోటీలో వేములవాడలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ కు చెందిన ఆరో తరగతి విద్యార్థిని గాజుల వివేకశ్రీ అత్యున్నత ప్రతిభ కనబరిచి బ్లాక్ బెల్ట్ సాధించినట్లు కరస్పాండెంట్ సన్నిధి వెంకట కృష్ణ తెలిపారు.కరాటే పోటీలలో అతి చిన్న వయసులోనే బ్లాక్ బెల్ట్ సాధించిన పాఠశాల విద్యార్థిని కరెస్పాండెంట్ అభినందించారు. బ్లాక్ బెల్ట్ సాధించుటకు శిక్షణ ఇచ్చిన కరాటే మాస్టర్ అబ్దుల్ మన్నాన్ తో పాటు సహకరించిన తల్లి దండ్రులకు అయన కృతజ్ఞతలు తెలిపారు.

# హెల్త్ కార్డ్స్ పేరుతో దోపిడీ

**ఓపీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు కృష్ణమూర్తి..శ్రీనివాస్**

**గోదావరిఖని, జనంసాక్షి:**
రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు..ఉపాధ్యాయుల వివరాలు నమోదు కాకుండా.. గైడ్లైన్స్ విడుదల కాకుండా, డ్రాయింగ్ అధికారులు బిల్ చేయకుండా, ఎటువంటి ముందస్తు సూచనలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం హెల్త్ కార్డు డిటేయిల్స్ అప్లోడ్ చేయకుండానే మే నెల జీతం నుంచి ఈహెచ్సీ అమౌంట్ డిడక్షన్ చేశారని పెద్దపల్లి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుండు కృష్ణమూర్తి, కానుగంటి శ్రీనివాస్ తెలిపారు. ఉద్యోగులైన భార్యాభర్తలు ఇరువురు జీతంలో కోత విధించారని పేర్కొన్నారు. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా కోత విధించటం దుర్మార్గమైన చర్య దీనిని పీఆర్టీయూటీఎస్ పెద్దపల్లి జిల్లా శాఖ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.జూన్ నెల నుండి ఇంప్లిమెంట్ చేస్తామని మే నెల జీతంలో కోత విధించటం భావ్యం కాదని వారు సూచించారు.ఈ డబ్బులు ఎటు డైవర్ట్ చేస్తారో ఈహెచ్ఎస్ పథకం పైన అనుమానాలు ఉన్నాయని వారు తెలిపారు. గతంలో అందించిన కార్డ్స్ ఎందుకు పనికి రాలేదని,ఉద్యోగ ఉపాధ్యాయులు తమ ఖాతాలో దాచుకున్న డబ్బులు తమ అవసరాల కోసం తీసుకోవాలని గత 3 సంవత్సరాల నుండి ప్రయత్నం చేస్తున్నా ఫలితం లేదని వారు తెలిపారు.మళ్లీ ఈ స్కీమ్ పేరుతో వసూళ్ల పర్వం మొదలైందన్నారు.ఎటువంటి ఆధారాలు, అనుమతి లేకుండా కటింగ్ చేయడం దుర్మార్గమని వారు అన్నారు. వెంటనే డిడక్షన్లు ఆపేయాలని..రివర్స్ క్రెడిట్ చేయించాలని జిల్లా శాఖ పక్షాన కోరుతున్నామని వారు తెలిపారు.

# పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**8 మంది జూదరుల అరెస్ట్, రూ.53 వేల నగదు స్వాధీనం**

**కరీంనగర్ రూరల్, మే 31(జనంసాక్షి)**
కరీంనగర్ రూరల్ పోలీసుల దాడిలో పేకాట ఆడుతున్న ఎనిమిది మంది జూదరులు అరెస్టయ్యారు. వారి వద్ద నుంచి రూ.53 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తీగలగుట్టపల్లి సరస్వతి నగర్ శివారులో చోటుచేసుకుంది.కరీంనగర్ రూరల్ పోలీస్ ఇన్స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డికి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ప్రత్యేక దాడి నిర్వహించారు. సరస్వతి నగర్ శివారులో కొందరు వ్యక్తులు మూడు ముక్కల పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు.అరెస్టైన వారిలో తన్నీరు శ్రీను, ఓర్సు సందీప్, తన్నీరు శేషయ్య, పొట్లపాటి అబ్రహాం, వల్లెపు రవి, కుంచాల నాగేంద్రబాబు, వల్లెపు పుల్లరాజు, పుల్లపు వెంకటరావు ఉన్నారు. వీరంతా కొన్ని సంవత్సరాల క్రితం ప్రకాశం జిల్లా నుంచి కరీంనగర్కు వచ్చి సరస్వతి నగర్ ప్రాంతంలో నివాసం ఉంటూ భవన నిర్మాణ కాంట్రాక్టు పనులు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.దాడి సమయంలో జూదం ఆడుతున్న వారి వద్ద నుంచి రూ.53 వేల నగదును స్వాధీనం చేసుకున్న పోలీసులు, వారిని పోలీస్ స్టేషన్కు తరలించి కేసు నమోదు చేశారు. అనంతరం తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం కోర్టుకు హాజరుపరచనున్నట్లు వెల్లడించారు.అక్రమ జూద కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, పేకాట నిర్వహించే వారిపైనా, పాల్గొనే వారిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ రూరల్ ఇన్స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి హెచ్చరించారు. ఈ దాడిలో ఎస్ఐ లక్ష్మారెడ్డి, కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది కీలకంగా పాల్గొన్నారు.



# పదవి విరమణ

**ముస్తాబాద్ మే 31 (జనంసాక్షి):**
ముస్తాబాద్ మండలంలోని, తెర్లుమద్ది, బదనకల్, వెంకట్రావు పల్లె గ్రామాలలో గ్రామ పాలన సేవలందించి. కొద్ది సమయంలోనే ప్రజల మెప్పు ఉంది. పదవి విరమణ పొందడం జరిగింది. ఈ సందర్భంగా మూలె సంజీవ్ మాట్లాడుతూ 1992లో రెవెన్యూలో ఉద్యోగం పొందడం జరిగింది. సారంగాపూర్ మండలంలో బీర్పూర్ గ్రామంలో విఆర్ఓగా సేవలందించారు. ముస్తాబాద్ మండలంలో పదవీ విరమణ చేయడం చాలా సంతోషం విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ఫారుక్, మండల అభివృద్ధి అధికారి లచ్చులు, డిప్యూటీ తాసిల్దార్ అపర్ణ, ఆర్ ఐ రఘు, వివిధ మండలాల జిపిఓలు పంచాయతీరాజ్ ఇంజనీర్లు ఎమ్మార్వోలు పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొన్నరు.



## గన్నె వారి పల్లెలో కొనుగోలు పూర్తి

**ముస్తాబాద్ మే 31 (జనంసాక్షి)**
ముస్తాబాద్ మండల గన్నే వరి పల్లె గ్రామంలో గ్రామ సర్పంచ్ రేసు రఘు ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు సెంటర్ నుండి పూర్తి చేసినట్లు తెలిపారు. సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని పూర్తిచేసుకుని మండలంలోని అతి తొందర్లోనే పూర్తి చేసుకోవడం జరిగింది. రైతుల, అధికారుల సహకారంతో పూర్తి చేసుకోవడం జరిగిందన్నారు.
కొండగట్టు గిరి ప్రదక్షణకు భారీగా తరలి వచ్చిన భక్తులు

## సిఐ,ఎస్ఐలకు సన్మానం

**సుల్తానాబాద్, మే 31(జనం సాక్షి):**



ఇటీవల నూతనంగా సిఐగా బాధ్యతలు చేపట్టిన రంజిత్ రావును ఆదివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో మియాపూర్ సర్పంచ్ మేకల పోచం, కర్రె కుమారస్వామి, ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. అంతేకాకుండా పదవి విరమణ పొందిన ఎస్సై వేణుగోపాల్ కు శుభాకాంక్షలు తెలిపి బోకేయో శాలువాతో శుభాకాంక్షలు తెలిపారు.

# ఆచార్య కలువకుంట రామకృష్ణకు 'ఆచార్య కళా ప్రపూర్ణ' పురస్కారం

**కరీంనగర్ టౌన్, మే 31 (జనంసాక్షి):**
ప్రముఖ సాహితీవేత్త, ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆచార్య కలువకుంట రామకృష్ణకు అఖిల భారత బ్రాహ్మణ ఐక్య వేదిక ప్రతిష్ఠాత్మక 'ఆచార్య కళా ప్రపూర్ణ' పురస్కారాన్ని ప్రదానం చేసింది. ఆదివారం నెల్లూరులో నిర్వహించిన అఖిల భారత బ్రాహ్మణ ఐక్య వేదిక బ్రాహ్మణ ఘోష సభలో జాతీయ అధ్యక్షుడు సాయి కుమార్, అవధాని సాయి కుమార్ తదితరులు ఈ అవార్డును అందజేశారు.ఈ సందర్భంగా అఖిల భారత బ్రాహ్మణ ఐక్య వేదిక జాతీయ అధ్యక్షుడు సాయి కుమార్ మాట్లాడుతూ, డాక్టర్ కలువకుంట రామకృష్ణ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక, విద్యా రంగాల్లో చేసిన విశేష సేవలకు గుర్తింపుగా ఈ గౌరవ పురస్కారాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. మూడు దశాబ్దాలకు పైగా ఉన్నత విద్యా రంగంలో అధ్యాపకుడిగా, పరిశోధకుడిగా, విద్యావేత్తగా ఆయన అందించిన సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు.విద్యా, సామాజిక రంగాల్లో చేసిన కృషికి గాను భారత రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయ స్థాయి పురస్కారాన్ని అందుకోవడం గర్వకారణమని పేర్కొన్నారు. రామకృష్ణ రచనలు ఇంగ్లీష్, హిందీ భాషల్లోకి అనువాదం కావడం, నేపాల్లో నిర్వహించిన కార్యక్రమంలో 'మాతృభాషా రత్న' అవార్డును అందుకోవడం



ఆయన ప్రతిభకు నిదర్శనమన్నారు. సాహిత్య సృజన, విద్యా సేవలు, సామాజిక చైతన్య కార్యక్రమాల ద్వారా సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తున్నందుకు గుర్తింపుగా ఈ అవార్డును అందిస్తున్నట్లు తెలిపారు.ఆచార్య కలువకుంట రామకృష్ణకు పురస్కారం లభించిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ఐక్య కార్యాచరణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ నితిన్ పాఠక్, టి.రాజయ్య, పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ తిరుకోవెల శ్రీనివాస్, స్టాఫ్ క్లబ్ కార్యదర్శి డాక్టర్ మల్లారం శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ ఎం.సత్యప్రకాశ్, మధురాజేశ్, డాక్టర్ బూర్ల చంద్రశేఖర్, డాక్టర్ కొమురారెడ్డి, కరుణాకర్, శంకరయ్య, సతీష్ కుమార్, రాధాకృష్ణ, శ్రీమతి శ్యామల చంద్ర, సోమ నర్సయ్య, రాపర్తి శ్రీనివాస్తో పాటు అన్ని విభాగాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.ఈ పురస్కారం ద్వారా ఆచార్య కలువకుంట రామకృష్ణ విద్యా, సాహిత్య, సామాజిక రంగాల్లో అందిస్తున్న సేవలకు మరోసారి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించినట్లయిందని పలువురు అభిప్రాయపడ్డారు.

## మహాశివుడి ఆశీస్సులు ప్రజలపై ఉండాలి

**– తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ విజయ రమణారావు**

సుల్తానాబాద్,మే 31(జనంసాక్షి) : ఆ మహా శివుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు వేడుకున్నారు. ఆదివారం మండలంలోని గట్టపల్లి గ్రామంలో గల శ్రీ.నాగ లింగేశ్వర స్వామి వారి ఆలయ 3 వ వార్షికోత్సవం కార్యక్రమానికి విచ్చేసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న విప్ కు ఆలయ పూజారుల తో పాటు స్థానిక నేతలు ఘన స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు.అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ,ఆ మహా శివుడి ఆశీస్సులతో నియోజకవర్గంలోని ప్రజలందరూ ఆయురారోగ్యాలు సుఖసంతోషాలు విరాజిల్లాలని వేడుకున్నామన్నారు. రానున్న రోజుల్లో ప్రజలందరికీ మరిన్ని సేవలందించేందుకు సంకల్పబలం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ,మార్కెట్ చైర్మన్,మినుపాల ప్రకాష్ రావు,గ్రామ సర్పంచ్ గుండేటి దేవేందర్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దామోదర్ రావు, మండల పార్టీ అధ్యక్షులు చిలుక సతీష్,ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

# భక్తితోపాటు పర్యావరణాన్ని కాపాడుదాం

## అర్చకులు సురేశ్ ఆత్మారాం

**మల్యాల మే 31 (జనంసాక్షి)**



చిలుకూరి బాలాజీ శివాలయ అర్చకులు రామదాస్ సురేశ్ ఆత్మారాం ఆధ్వర్యంలో తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ కొండగట్టులో 41 వ గిరి ప్రదక్షణ ఆదివారం దిగ్విజయంగా ముగిసింది. ప్రతినెలా పౌర్ణమి రోజు నిర్వహిస్తున్న గిరి ప్రదక్షణ ప్రారంభంలో 200 వందల సంఖ్యలో ప్రారంభమైన ఈ ఆధ్యాత్మిక యాత్రకు ప్రస్తుతం ఆదరణ పెరిగింది భక్తులను ఆధ్యాత్మికతవైపుకు తీసుకెళ్తుంది, నియమ నిష్టలతో గిరి ప్రదక్షిణ చేసి స్వామివారిని దర్శించు కుంటే కష్టాలు,గ్రహదోషాలు తొలగిపోయి, ధైర్య సాహసాలు, మానసిక ప్రశాంతత లభిస్తుందని భక్తుల బలమైన నమ్మకం.గిరిప్రదక్షిణలో సుమారు 50 వేల మందిగా భక్తులు పాల్గొన్నట్లుగా అంచనా.

**భక్తితో పాటు పర్యావరణాన్ని కాపాడుదాం**

**సురేశ్ ఆత్మారాం**

కొండగట్టు దేవస్థానం అనగానే స్వామి వారితో పాటు గుర్తొచ్చేది అక్కడ భారీ సంఖ్యలో ఉండే కోతులని రోజురోజుకు అడవులు తగ్గిపోవడంతో పాటు కొండలపై సరైన ఆహార వనరులు లేకపోవడంతో కోతులు ఆహారం కోసం తరచుగా భక్తులపై,స్థానిక గ్రామాలపై పడుతూ ఇబ్బంది పెడుతున్నాయని.



రాబోయేది వర్షాకాలం కాబట్టి సీడ్ బాల్స్ ని తీసుకువచ్చి ఖాళీ ప్రదేశాల్లో చల్లితే మొలకెత్తి కొద్ది రోజుల్లోనే పచ్చని పండ్ల వృక్షాలుగా మారుతాయి పెరిగి కోతులకు ఆహారం దొరుకుతుందని తెలిపారు. గిరి ప్రదక్షణకు తరలివచ్చే భక్తులందరూ ఆధ్యాత్మిక భక్తి భావనతో పాటు పర్యావరణ రక్షణ బాధ్యతగా ప్రతి ఒక్కరూ 108 సీడ్స్ బాల్స్ తీసుకురావాలని భక్తులందరితో ప్రతిజ్ఞ చేయించారు.

### తగ్గెల్లి, కల్దుర్కి గ్రామాలలో ఘనంగా

# అహల్యా బాయి హోల్కర్ జయంతి వేడుకలు

**బోధన్, మే 31 (జనంసాక్షి) :**



నిజామాబాద్ జిల్లా సాలూర మండలం తగ్గెల్లి, బోధన్ మండలం కల్దుర్కి గ్రామాలలో ఆదివారం కురుమ సంఘం ఆధ్వర్యంలో పుణ్యశ్లోక మహారాణి అహల్యాబాయి హోల్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అహల్యాబాయి హోల్కర్ ధర్మపరాయణురాలు, ప్రజాహిత పాలకురాలు. ఆమె తన పాలనలో ప్రజల సంక్షేమం కోసం అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి, దేశవ్యాప్తంగా ఆలయాలు, ఘాట్లు, ధర్మశాలల నిర్మాణానికి విశేష కృషి చేశారన్నారు. ఆమె ఆదర్శవంతమైన జీవితం నేటి తరానికి స్ఫూర్తి దాయకమని కొనియాడారు. తదనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అరుణ బాయి, బోధన్ కురుమ నాయకులు రావుభ గంగాధర్, దేవురావు, మేడి రవి, చంద్రకాంత్, వీరేష్, రాజు, మహేష్, బాలాజీ, బజరంగ్ నిఖిల్, ప్రభాకర్, సదానంద్, రినేష్, గంగాధర్, దేవేందర్, సదానంద్, వెంకట్, బీరయ్య, సాయిలు, మక్కుగొండ, సాయిగొండ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు. అలాగే కల్దుర్కి గ్రామంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో పుణ్యశ్లోక మహారాణి అహల్యాబాయి హోల్కర్ గారి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కల్దుర్కి కుర్మా సంఘం అధ్యక్షుడు సిరిగిరి రామ్, సెక్రటరీ గౌరు గోండా, అశోక్, మహేష్, శ్రీనివాస్, పేరజి, సాయిగోండా, నాగ్ గోండ, శేఖర్, శివ, తదితరులు పాల్గొన్నారు.

# సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఎంఎస్పీ జీవో కాపీల దగ్ధం

**ఎడపల్లి, మే 31 ( జనంసాక్షి ) :**



సంయుక్త కిసాన్ మొర్చా దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఆదివారం ఎడపల్లిలో అఖిలభారత ఐక్య రైతు సంఘం ఆఫీస్ దగ్గర రైతు సంఘాల ఆధ్వర్యంలో ఎంఎస్పీ ఆర్డర్ కాపీలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గుమ్ముల గంగాధర్ మాట్లాడుతూ, రైతులకు లాభదాయక ధరలు ఇస్తున్నట్లుగా ధరల కమిషన్ వాదిస్తుందని ఇది ఎంత మాత్రం వాస్తవం కాదన్నారు. ఎంఎస్పి ప్రకటించే ముందు రైతులు పెట్టిన పెట్టుబడిని ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోలేదని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను పట్టించుకోకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత ఐక్య రైతు సంఘం నాయకులు మండల నాయకులు సుదర్శన్, కాశ. రవి, హన్మాండ్లు, ఇందూర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# స్వర్గీయ రాజలింగం సార్ ఆశయాలు ముందుకు తీసుకు వెళదాం

**ఎడపల్లి, మే 31 ( జనంసాక్షి ) :**



ఎడపల్లి గ్రామంలో రాజలింగం సార్ చేసిన, అందించిన సేవలు అమూల్యమైనవని ఉద్యోగుల సంఘం ప్రతినిధులు స్పష్టం చేశారు. ఆదివారం రాజలింగం యాదిలో ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ, ఉపాధ్యాయునిగా వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహించినా.. ఆయనకు స్వగ్రామం ఎడపల్లి పై మమకారం ఎక్కువే అని ఆయన చేపట్టిన కార్యక్రమాలు నిరూపిస్తాయి. తన గ్రామానికి ఓ ప్రత్యేకత వుండాలని చివరి వరకు ఆశించి.. అందుకు తగ్గ కార్యక్రమాలు చేపట్టిన గొప్ప వ్యక్తి.. ఎడపల్లి గ్రామంలో ప్రభుత్వ ఉద్యోగులు ఎక్కువ సంఖ్యలో వున్నారని గుర్తించి.. వారిని ఏకీకృతం చేసి 'స్థానిక ఉద్యోగుల సంఘాన్ని ' ఏర్పాటు చేశారు.. ఈ సంఘం ద్వారా ఉద్యోగుల సమస్యల పరిష్కారమే కాదు.. మరేదైనా చేయాలనే తళంపుతో.. ప్రగతి పబ్లిక్ స్కూల్ ను స్థాపించారు.. దీని ద్వారా నిరుద్యోగులకు ఉపాధి తో పాటు, తక్కువ ఫీజు లతో నాణ్యమైన విద్యను అందించేందుకు కృషిచేశారు..తెలంగాణ మలిదశ ఉద్యమంలో బోధన్ లో నిర్వహించిన దీక్షలకు ధీటుగా.. ఎడపల్లిలో అన్ని వర్గాల ప్రజలను, ఉద్యోగులను సమన్వయం చేస్తూ జేఏసీ పేర వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహించి, దీక్షా శిభిరాన్ని కొనసాగించారు. లయన్స్ సభ్యునిగా పలు స్వచ్ఛంద సేవలు అందించారు. ఆయన ఆశయ సాధనకు కృషిచేద్దామని వక్తలు ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గంగారెడ్డి, ఎడపల్లి మాజీ సర్పంచ్ మాణిక్ ఎల్లయ్య యాదవ్, మాజీ ఉపసర్పంచ్ ఆకుల శ్రీనివాస్, ఉద్యోగుల సంఘం ప్రతినిధులు గంగాధర్, గంగామణి, న్యావనంది హన్మాండ్లు, కిషోర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

### సమాచారం లేకుండా ఉద్యోగ ఉపాధ్యాయుల మే నెల జీతం లో ఈ హెచ్ ఎస్ ప్రీమియం మినహాయింపుపై తపస్ కరీంనగర్ జిల్లా శాఖ తీవ్ర ఆక్షేపణ

**కొత్త పెల్లి మే 31 (జనంసాక్షి)**

ఈ రోజు ప్రభుత్వం ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ సంఘాలతో చర్చించకుండా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ ల మే నెల జీతాల నుంచి (ఇఊహ) ఎంప్లాయ్ హెల్త్ స్కీం కొరకు ఎటువంటి నియమావళి రూపొందించకుండా నెలవారి ప్రీమియం (సబ్స్క్రిప్షన్) మినహాయించడం చేయడం అత్యంత ఆక్షేపనీయమని, ప్రభుత్వ దుర్మార్గమైన ఏకపక్ష చర్యగా తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం తపస్ కరీంనగర్ జిల్లా శాఖ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. ఉద్యోగ ఉపాధ్యాయ స్నేహపూరిత ప్రభుత్వమని చెప్పుకునే ప్రభుత్వ పెద్దలు దీనిని ఏ రకంగా సమర్ధించుకుంటారని ఇటువంటి ప్రభుత్వ చర్యను సభ్య సమాజం హర్షించదని దీనిని అన్ని సంఘాలు ముక్త కంఠంతో తో ఖండించాలని,వాస్తవానికి గత మూడు సంవత్సరాలుగా తెలంగాణ ఉద్యోగ మరియు ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన డిఏలు, పిఆర్సిలను, చెల్లించాల్సిన అన్ని రకాల బకాయిలు చెల్లించడానికి చేతులు రాని ప్రభుత్వం ఇఊహ పేరుతో ముందస్తు సమాచారం లేకుండా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ ల మే నెల జీతాలలో కోత విధించడం అత్యంత దారుణమైన కవ్వింపు చర్యగా తపస్ భావిస్తున్నదనిఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచించి మినహాయించిన డబ్బులను ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఖాతాలకు తిరిగి జమ చేయాలని, అదేవిధంగా ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి అందించాల్సిన వైద్య సేవలు, హాస్పిటల్ ల వివరాలతో కూడిన సమగ్రమైన నియమావళిని రూపొందించి హెల్త్ కార్డులను జారీ చేసిన తర్వాత మాత్రమే మినహాయింపు చేయాలని లేని పక్షంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం కార్యాచరణకు సిద్ధం అవుతుందని అందుకు ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లు సిద్ధం కావాలని తపస్ కరీంనగర్ జిల్లా శా?

# 7వ రోజుకు చేరుకున్న వివోఎల నిరవధిక సమ్మె

**ఎడపల్లి, మే 31 ( జనంసాక్షి ) :**

తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం వివోఏలు చేపడుతున్న నిరవధిక సమ్మె ఆదివారం నాటికి ఏడవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వివోఏలకు కనీస వేతనం నెలకు 26 వేల రూపాయలను అందించాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్ పాలసీ వర్తింపజేయాలని, అర్హులైన వివోఏలకు సీసీలుగా పదోన్నతి కల్పించాలని, వివోఏలకు సాధారణ ఆరోగ్య బీమా సౌకర్యం 20 లక్షల వరకు కల్పించాలని, ట్యాబ్, నెట్ సౌకర్యం కల్పించాలని జీవో 58 ను సవరించాలని వారు కోరారు. తమ న్యాయమైన డిమాండ్లను అమలు చేయకపోతే ఈ సమ్మెను మరింత రాష్ట్రవ్యాప్తంగా ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు.



# బోధన్ డిపో ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడిగా హనీఫుద్దీన్ ప్రధాన కార్యదర్శిగా జిఎన్ గౌడ్

**బోధన్, మే 31 ( జనంసాక్షి ) :**



బోధన్ ఆర్టీసీ డిపో ఎంప్లాయిస్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని మహాలక్ష్మి కళ్యాణ మండపంలో నిర్వహించిన సాధారణ సమావేశంలో ఈ ఎన్నికలు జరిగాయి. యూనియన్ అధ్యక్షుడిగా హనీఫుద్దిన్, ప్రధాన కార్యదర్శిగా జి.ఎన్. గౌడ్, కోశాధికారిగా ఎం. గంగారాం, వర్కింగ్ ప్రెసిడెంట్గా బి. పోతారెడ్డి, గ్యారేజ్ కార్యదర్శిగా సురేష్, మహిళా కార్యదర్శిగా బి.ఎ. రాణి, మహిళా అధ్యక్షురాలిగా డి. కమలలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రధాన కార్యదర్శి జి.ఎన్. గౌడ్ మాట్లాడుతూ, కార్మికుల న్యాయమైన హక్కుల సాధన కోసం ఉద్యోగులతో కలిసి పనిచేస్తూ, యాజమాన్యంతో సమన్వయం కొనసాగించి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. తనపై విశ్వాసం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. నూతన కార్యవర్గ సభ్యులను సమావేశంలో పాల్గొన్న ఉద్యోగులు, యూనియన్ సభ్యులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డెలిగేట్లు ఉమామహేశ్వరి, శ్వేత, ఆర్గనైజింగ్ సెక్రటరీ సావిత్రి, యాదు, మీరా, జెఎస్ గౌడ్, వీఎస్ రావ్, లాలయ్య, సుమన్, సుధాకర్, లాల్ రాం తదితరులు పాల్గొన్నారు.

# కొండగట్టు దేవస్థాన ప్రధాన అర్చకుడి పదవీ విరమణ

## దేవస్థానం ఆధ్వర్యంలో సన్మానం

**మల్యాల మే 31 (జనంసాక్షి)**

తెలంగాణ లోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానంలో ప్రధాన అర్చకుడు వకుళాభరణం రఘు ఆదివారం పదవీ విరమణ చేశారు. అర్చకులు రఘు కుటుంబ సభ్యులతో కలిసి ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదోక్త మంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనాలు అందించి, స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేశారు. అనంతరం దేవస్థానం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈఓ ఎస్. అంజనారెడ్డి శాలువాతో సత్కరించారు. అర్చక విభాగం తరపున ఉప ప్రధాన అర్చకులు చిరంజీవి, చిన్నరాము వస్త్రాలు అందజేసి ఘనంగా సన్మానించారు. సహచర అర్చకులు, ఆలయ సిబ్బంది అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ హరిహర్నాథ్, సూపరింటెండెంట్లు సునీల్, చంద్రశేఖర్, చెక్కిళ్ళ అశోక్ , ప్రధాన అర్చకులు రామకృష్ణ, జితేందర్, ఉప ప్రధాన అర్చకులు చిరంజీవి, మారుతి ప్రసాద్, చిన్నరాము, ముఖ్య అర్చకులు లక్షణ ప్రసాద్, అభిలాష్ పలువురు పాల్గొన్నారు.







## గాలిపల్లిలో ఘనంగా పోచమ్మ బోనాల వేడుకలు

**ఇల్లంతకుంట మే 31(జనంసాక్షి )**

ఇల్లంతకుంట మండలం గాలిపల్లి గ్రామంలో రెడ్డి సంఘనీ ఆధ్వర్యంలో పోచమ్మ బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేసి బోనాలు సమర్పించారు. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో డప్పు చప్పుల్ల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల వేడుకల్లో పెద్ద సంఖ్యలో ప్రజల పాల్గొన్నారు.

## ముస్తాబాద్ ఎస్సైగా జ్యోతి



**ముస్తాబాద్ మే 31 (జనంసాక్షి)**

ముస్తాబాద్ ఎస్సైగా జి. జ్యోతి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై సిహెచ్ గణేష్ సిరిసిల్ల పట్టణ ఎస్సైగా బదిలీ డి సి ఆర్ బి సిరిసిల్లలో పనిచేస్తున్న జ్యోతి ముస్తాబాద్ ఎస్సైగా బదిలీ అయ్యారు. ముస్తాబాద్ ఎస్సైగా మొదటిసారి మహిళ ఎస్సై బాధ్యతలు చేపడుతున్నారు.

### టిపిసిసి ప్రధాన కార్యదర్శిని కలిసిన సయ్యద్ ఇంరోస్ హైమద్

**కామారెడ్డి ప్రతినిధి, మే 31 (జనంసాక్షి)**

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డిని కామారెడ్డి నివాసంలో ఆదివారం ఎంఐఎం 48 వార్డ్ ఇంచార్జ్, సయ్యద్ ఇంరోస్ హైమద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....టిపిసిసి ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి చేస్తున్నటువంటి పార్టీ పటిష్టతకు పాటుపాడటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పార్టీ అభివృద్ధికి ముందుకు రావడం, అలాగే సామజిక సేవా కార్యక్రమాలు చేయడం శుభ పరిణామం అన్నారు. ఈ సందర్బంగా మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు సలీం, జమిల్ బాయ్, డీసీసీ జిల్లా ఉపాధ్యక్షులు పంపరి లక్ష్మణ్, ఆబిద్, బాస సాయిలు తదితరులు ఉన్నారు.



## తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలు వెంటనే నెరవేర్చాలి

### రాష్ట అధ్యక్షుడు న్యాయవాది ఉమా మహేష్

**జగిత్యాల జనం సాక్షి :**



తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలనీ న్యాయవాది, తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల సాధన వేదిక రాష్ట అధ్యక్షుడు కూర్మాచలం ఉమా మహేష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా న్యాయవాది ఉమా మహేష్ మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో వేలాది మంది యువకులు, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజా సంఘాల నాయకులు తమ జీవితాలను, ఉద్యోగాలను, కుటుంబ సౌఖ్యాలను సైతం త్యాగం చేశారనీ, ఉద్యమకారుల పోరాటం, త్యాగాలు అమరవీరుల బలిదానాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందాని గుర్తు చేశారు. రాష్ట్రం ఏర్పడి సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ, అనేక మంది తెలంగాణ ఉద్యమకారులు ఇప్పటికీ ప్రభుత్వ గుర్తింపు, సంక్షేమ పథకాలు , ఇతర హామీల కోసం ఎదురుచూస్తున్నారనీ ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమ సమయంలో ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో అమలు కాకపోవడం బాధాకరమని తెలిపారు. కాబట్టి తెలంగాణ ప్రభుత్వం 6 డిమాండ్ల పై తక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు.

1. అర్హులైన తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి అధికారిక గుర్తింపు కార్డులు జారీ చేయాలి.
2. ఉద్యమకారులకు ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేయాలి.
3. నిరుద్యోగ ఉద్యమకారులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి.
4. వృద్ధాప్యంలో ఉన్న ఉద్యమకారులకు గౌరవప్రదమైన పెన్షన్ అందించాలి.
5. తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు మరింత ఆర్థిక, సామాజిక భద్రత కల్పించాలి.
6. తెలంగాణ ఉద్యమ చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చి భావితరాలకు తెలియజేయాలి.

తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులను గౌరవించడం ప్రతి ప్రభుత్వానికి నైతిక బాధ్యత అని అన్నారు. ఉద్యమకారుల త్యాగాలను మరువకుండా, వారి న్యాయమైన ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు రావాలని కోరుతున్నామనీ పేర్కొన్నారు. “తెలంగాణ వచ్చింది... కానీ తెలంగాణ ఉద్యమకారుల కలలు ఇంకా పూర్తిగా నెరవేరలేదనీ , ఉద్యమకారుల ఆకాంక్షల సాధన కోసం ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలనీ ఉమా మహేష్ డిమాండ్ చేశారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలిసిన పోతుగల్ సర్పంచ్ పెద్ది గారి యాదమ్మ శ్రీనివాస్

**ముస్తాబాద్ మే 31 (జనంసాక్షి)**



ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామ సర్పంచ్ పెద్ది గారి యాదమ్మ శ్రీనివాస్ మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలిసి పోతుగల్ నైట్ ఆల్ బస్సును జేబీఎస్ వరకు ఏర్పాటు చేయాలని మంత్రి కి వివరించగా వెంటనే స్పందించి జేబీఎస్ నుండి పోతుగల్ ఉదయం 5 గంటల నుండి. రాత్రి 9 గంటలకు జేబీఎస్ నుండి పోతుగల్ నైటాలు బస్సును ఏర్పాటు చేసినందుకు మంత్రి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన సర్పంచ్ పెద్ది గారి యాదమ్మ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## శ్రమదానం చేస్తున్న గ్రామస్తులు

**ముస్తాబాద్ మే 31( జనంసాక్షి)**



ముస్తాబాద్ మండలం బదనకల్ గ్రామంలో గ్రామ సర్పంచ్ చిగురు నరేష్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 6 గంటల నుండి 11 గంటల వరకు గ్రామస్తులు యువకులు, మహిళలు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున శ్రమదానం చేస్తూ పిచ్చి మొక్కులు తొలగించి చెత్తాను తొలగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పాలకవర్గం పాల్గొన్నారు.

## అంతిమ యాత్రలో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్

రుద్రంగి మే 31 (జనం సాక్షి)

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గ పరిధిలోని రుద్రంగి మండల కేంద్రంలో రుద్రంగి మాజీ సర్పంచ్ చెలుకల గంగ రాజయ్య సతీమణి, మార్కెట్ కమిటీ చైర్మన్ చెలకల తిరుపతి మాతృ మూర్తి చెలకల బుచ్చవ్వ మృతి చెందగా రాష్ట్ర ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ అంతిమ యాత్రలో పాల్గొని వారి పార్థివదేహానికి నివాళు లు అర్పించారు.



# ట్రిపుల్ ఐటీలో సీట్ సాధించి ఆదర్శంగా నిలిచిన మోడల్ స్కూల్ విద్యార్థులు

## విద్యార్థులను అభినందించిన పాఠశాల ప్రిన్సిపాల్ హార్జిత్ కౌర్

**చిగురుమామిడి మే31(జనంసాక్షి):**

తెలంగాణ ప్రభుత్వ మోడల్ స్కూల్ చిన్న ముల్కనూర్ విద్యార్థులు ఆర్జీయూ కేటీ బాసర(ఐఐటి) ప్రవేశాల్లో ముల్కనూర్ మోడల్ స్కూల్లో విద్యను అభ్యసించిన విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో ప్రవేశాల్లో విశిష్ట ప్రతిభ కనబరిచి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. పాఠశాలకు చెందిన ఏ యశ్వంత్ రెడ్డి, బి, సాత్విక్ రెడ్డి, కంది శ్రీనిక రెడ్డిలు తమ ప్రతిభతో రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ బాసరలో ప్రవేశం పొందారు. ఈ విజయం విద్యార్థుల కృషి పట్టుదల కార్యదీక్షతో అలాగే తల్లిదండ్రుల ప్రోత్సాహం సహకారంతో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో నిదర్శనంగా విద్యార్థులకు ఆదర్శంగా నిలిచిన ఈ విద్యార్థుల ప్రతిభ ఘనత పాఠశాల ప్రభావాలను, ఇతర విద్యార్థులను ప్రతిబింబిస్తూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానో పాధ్యాయులు హార్జిత్ కౌర్, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ ఘనత సాధించిన విద్యార్థులను ఆదర్శంగా తీసుకొని విద్యార్థిని విద్యార్థులందరూ ముందుకు వెళ్లాలని సూచించారు.



# ఖాసీంపేట బట్టపల్లి కుంట వద్ద భారీ అగ్ని ప్రమాదం

**○అగ్నికి ఆహుతైన దుడ్డే,200 గడ్డి కట్టలు బోరు,సర్వీస్ వైరు స్టార్టర్ డబ్బా ○అస్తిక్ పైపులు 100 మీటర్లు 20 స్ప్రింక్లర్లు ○వరి కొయ్యలని కాల్చవద్దని ప్రభుత్వం జీవో జారీ ○నిబంధనలకు నీళ్లు... పట్టించుకోని అధికారులు**





**గన్నేరువరం, మే 31 (జనంసాక్షి):** గన్నేరువరం మండలంలోని ఖాసీంపేట గ్రామ శివారులోని బట్టపల్లి కుంట పైన ఉన్న రైతుల వ్యవసాయ పొలం వద్ద ఆదివారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. వడ్లూరు, పారువెల్ల, ఖాసీంపేట శివారులో బొజ్జ రాములు, ఓరుగంటి సంపత్ కు చెందిన వ్యవసాయ భూములు కలవు. పక్కనే పారువెల్ల కు చెందిన రైతుల భూములు కలవు. వారి వరి పొలంలో నుంచే మంటలు చెలరేగి సుమారు 10 ఎకరాలు కాలుకుంటూ సంపత్ కు చెందిన బోరు, సర్వీస్ వైరు, స్టార్టర్ డబ్బా , ఆస్తిక్ పైపు, 10 స్పిన్కర్ పైపులు సుమారు రూ 1.50 వేల నష్టం జరిగింది. బొజ్జ రాములు రైతువి 200 గడ్డి కట్టలు, 10 స్ప్రింక్లర్లు పైపులు, పెద్ద తార్పాలైన్ కవర్లు రెండు, కేశింగ్ పైపు, పాలు తాగే దుడ్డే మృతి చెందగా సుమారు రూ 1 లక్ష నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వరి కొయ్యలను కాల్చవద్దని ఇటీవలనే ప్రభుత్వం జీవో జారీ చేసిన ఎక్కడికక్కడ ప్రమాదాలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. ఇంకా జరిగిన కూడా అధికారులు పట్టించు కోవడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలంలో అగ్గి వేసిన రైతులపై చర్యలు తీసుకొని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.



## తెలంగాణ ఆవిర్బావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై అధికారుల పరిశీలన

**గోదావరిఖని, జనంసాక్షి:**
తెలంగాణ రాష్ట్ర ఆవిర్బావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జూన్ 2వ తేదీన నిర్వహించనున్న వేడుకల కోసం స్థానిక జీఎం కాలనీ గ్రౌండ్‌లోని గోదావరి కళా ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఓటు జీఎం చంద్రశేఖర్, ఏజీఎం (ఈఅండ్ఎం) రామ్మోహన్‌రావు, డీజీఎం (సివిల్) వరప్రసాద్, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, సీనియర్ పర్సనల్ ఆఫీసరర్ హనుమంతరావు, సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి గ్రౌండ్‌లో ఏర్పాటు చేస్తున్న వివిధ సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వేడుకల సందర్భంగా స్థానిక కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు, వివిధ రకాల బృందాలు, వివిధ తినుబండారాల స్టాల్స్, సాయంత్రం నిర్వహించనున్న వినోదాత్మక, సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాట్లపై అధికారులు సమీక్ష నిర్వహించి తగిన సూచనలు, సలహాలు అందించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమ ప్రాంగణాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దడంతో పాటు ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ వేడుకలను విజయవంతం చేయడానికి అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో పేర్కొన్నారు.

## మంత్రులకు కృతజ్ఞతలు..



గోదావరిఖని, జనంసాక్షి:
తెలంగాణ రాష్ట్ర వసతి గృహాలలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 17 చిన్న కాంట్రాక్టర్లకు చాలా ఇబ్బందిగా ఉందని, దానిపై ఆధారపడి బతుకుతున్న ప్రత్యక్షంగా 15000 మంది, పరోక్షంగా 30 వేల మంది జీవనోపాధి సమస్య అని మంత్రివర్యులు దుద్దిల్ల శ్రీధర్‌బాబుకు ఆగస్టు 25న పరిస్థితిని వివరిస్తూ లెటర్ ఇవ్వడం జరిగిందని, దానిని దృష్టిలో పెట్టుకుని పేద వాళ్లకు న్యాయం చేయాలని సాంఘిక సంక్షేమ హాస్టల్లో ఇంతకు ముందులాగా ఎస్సీలకు 40 పర్సెంట్ ఎండిలో సబ్సిడీని కల్పిస్తూ మేము ఏదైతే కోరినామో వసతిగృహానికి ఒక్కొక్కటిగా టెండర్ వేయాలని కోరామని పేర్కొన్నారు. అలాగే ఈ నెల 29న సర్కులర్ విడుదల చేసి పేదవారి కడుపు నింపిన దుద్దిల్ల శ్రీధర్ బాబుకు, అలాగే అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు, పొన్నం ప్రభాకర్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని తెలంగాణ రాష్ట్ర గురుకుల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొంకటి లింగమూర్తి, పెద్దపల్లి జిల్లా కమిటీ సభ్యులు నూతి తిరుపతి, బి.తిరుపతి, మిట్టపల్లి రాజమౌళి తెలిపారు.

## ఎస్సై వేణుగోపాల్ సేవలు మరువలేనివి

**- నిబద్ధతతో విధులు నిర్వహించారు**
**- క్రమశిక్షణకు మారుపేరు వేణుగోపాల్**
**- పదవి విరమణ సమావేశంలో సిఐ రంజిత్ రావు**




**సుల్తానాబాద్,మే 31(జనంసాక్షి) :**
నిబద్ధత ఆత్మవిశ్వాసం క్రమశిక్షణతో ఎస్సైగా నిర్వహించిన వేణుగోపాల్ సేవలు మరువలేనివని సీఐ రంజిత్ రావ్ అన్నారు. ఆదివారం పదవి విరమణ సందర్భంగా స్థానిక సర్కిల్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి ఎస్ఐ వేణుగోపాల్ చేసిన సేవలు గుర్తుతెచ్చుకున్నారు. ఈ సందర్భంగా సిఐ రంజిత్ రావు ఎస్సై చంద్రకుమార్ వేణుగోపాల్ కు పూలమాల శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐ రంజిత్ రావు మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రతి పోలీస్ ఫిట్నెస్ కలిగి ఉండాలని, విధి నిర్వహణలో క్రమశిక్షణ ని బద్ధతతో, నైపుణ్యత కలిగి ఉండాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో ఎస్సై వేణుగోపాల్ అధికారుల ఆదేశాలను తూ. చ,తప్పకుండా పాటించేవాడని తెలిపారు. విధి నిర్వహణలో పోలీసులు కేవలం తన డ్యూటీ కాకుండా మిగతా అన్ని విధులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. శేష జీవితంలో వేణుగోపాల్ సంతోషంతో గడపాలని కోరారు. ఎస్సై చంద్రకుమార్ మాట్లాడుతూ ఎస్సై వేణుగోపాల్ సేవా భావం కలిగిన వ్యక్తిత్వం, అందరిని కలుపు పోయే వ్యక్తిత్వం కలవాడని, పని భారంతో ఉంటే ఎస్సై వేణుగోపాల్ కు బాధ్యతలు అప్పజెప్పేవాడినని, ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదన్నారు. వేణుగోపాల్ ప్రతి దరఖాస్తు కు న్యాయం చేయాలన్న పట్టుదల ఉండేవాడని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ,మహిళ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## బాసర ట్రిపుల్-ఐటీకి ఆదర్శ పాఠశాల విద్యార్థులు..

### అభినందించిన ప్రిన్సిపాల్ సదానందం..




**అంతర్గాం, జనంసాక్షి:**
మండలంలోని లింగాపూర్ ఆదర్శ పాఠశాల ఏడుగురు విద్యార్థులు బాసర ట్రిపుల్-ఐటీలో సీటు సాధించారని ప్రిన్సిపాల్ సదానందం తెలిపారు. ఆదివారం వెలువడిన ఫలితాల్లో టి.జశ్వంత్, బి.మనోరశ్మీత, యు.వైష్ణవి, పి.అఖిల్, జి.సహస్ర, ఎం.ప్రణీత, జీనత్ మీర్జా ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సదానందం పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు, తల్లిదండ్రులకు పాఠశాల ఉపాధ్యాయ బృందం, ప్రిన్సిపాల్ సదానందం అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సెస్సీ ఫలితాల్లో 100కు 46 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారని, ఇది పాఠశాల విద్యాప్రమాణాలకు నిదర్శనమని సదానందం తెలిపారు. అదే విధంగా 6వ తరగతిలో ప్రవేశాలకు ఎంపికైన విద్యార్థుల వివరాలతో పాఠశాలలో జూన్ 2వ తేదీ నుంచి సంప్రదించాలని ప్రిన్సిపాల్ సదానందం పేర్కొన్నారు.

# గత నెలలో వడ దెబ్బతో దంపతులు ఇద్దరు 15 రోజుల వ్యవధిలో మృతి

**○ ఇద్దరు కవలలు రాము -లక్ష్మణ్ అనాదలయ్యారు**
**○ నేటివరకు బాధితులను పరామర్శించని స్థానిక ఎమ్మెల్యే చింతకుంట అండ్ మాజీ ఎమ్మెల్యే దాసరి**



**పెద్దపల్లి,మే 31(జనంసాక్షి) :**
పెద్దపల్లి మండలం తుర్కల మద్దికుంట (గొల్లపల్లె) గ్రామానికి చెందిన పేద కుటుంబం అయిన కొండ రాధ ఎప్రిల్ 26వ తేదీన వడ దెబ్బతో మృతి చెందగా ఆ బాధ నుండి తేరుకోక ముందే మృతురాలి భర్త కొండ భూమయ్య కూడ మే 13న ఎండ తీవ్రతతో అకస్మాత్తుగా మృతి చెందాడు. అటు తల్లి ఇటు తండ్రి మరణం తో ఆ కుటుంబం లో ఇద్దరి మరణం ఆశ్చర్యానికి గురిచేసింది. కుటుంబ పెద్దదిక్కు కోల్పోవడంతో తెలిసి తెలియని వయసులో ఉన్న ఇద్దరు కవలలు రాము-లక్ష్మణ్ అనాథలు అయ్యారు. ఒక కూతురు కు అప్పు చేసి వివాహం చేశారు. రెక్కడితే గాని డొక్కాడనిది వారి కుటుంబం.. పేద కుటుంబాల్లో ఇలాంటీ ఘటనలు జరిగి నపుడు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకు లు పై స్థాయి ప్రతినిధులకు సమాచారం ఇవ్వాలీ కానీ ఇక్కడ ఆలాంటివి ఏమి కనబడలేదు. నియోజకవర్గంలో సుడిగాలి పర్యటనలు,పరామర్శలు, అభివృద్ధి శంకుస్థాపనల కార్యక్రమాల తో పాటు ఇలాంటి పరిస్థితుల్లో కూడా బాధిత కుటుంబాలను పరామర్శించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి నియోజకవర్గం అంతా బాదిత కుటుంబాల పరామర్శలే కానీ తురకల మద్దికుంట మీద మాత్రం సవతి చూపే. ప్రస్తుత ఎమ్మెల్యే సిహెచ్ విజయ రమణారావు కూడా సమాచారం తెలిసిన కూడా నేటికీ బాధిత కుటుంబాన్ని పరామ ర్శించలేదు. పెద్దపల్లి క్యాంపు కార్యాలయా నికి ఆరు కిలోమీటర్ల దూరం మాత్రమే తురకల మద్దికుంట గ్రామం.. ప్రజల భద్రతే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రభుత్వంలో ఇలాంటి ఘటనలు జరిగినపుడు గ్రామ స్థాయి ప్రతినిధులు, నాయకులు పై స్థాయి ప్రతినిధులకు సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత ఇంతైనా ఉంది.

## ఆకాల మరణం చెందిన ఉపాధ్యాయుడి కుటుంబానికి సంఘం తరపున రూ. లక్ష ఆర్థిక సహాయం



**పెద్దపల్లి,మే 31 (జనంసాక్షి) :**
ఇటీవల అకాల మరణం చెందిన పెద్దపల్లి మండలం రంగాపూర్ పాఠశాల ప్రభుత్వ ఉపాధ్యా య ు ు డ ు , వి ఆర్టీ య ు టి ఎ న్ సంఘ క్రీయాశీలక సభ్యుడు కల్వల శ్రీనివాస్ కుటుంబానికి సంఘం తరపున చేయూతనందించారు. సంఘం రాష్ట్ర సంక్షేమ నిధి నుండి రూ. లక్ష ఆర్థిక సహాయాన్ని చెక్ రూపంలో అందజేశారు. మృతుని సతీమణి ధనలక్ష్మికి ఆదివారం చెక్కును అందించారు. కల్వల శ్రీనివాస్ సంఘానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గండు కృష్ణమూర్తి, కానిగంటి శ్రీనివాస్, పెద్దపల్లి మండల శాఖ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు మెతుకు తిరుపతి,లక్కర్స్ రాములు,రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు చిలువేరు సదాశివ,నీలం నరేందర్,రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓల్లే శ్రీనివాస్,జిల్లా నాయకులు కాసార్ల శ్రీనివాస్,కజ్జం రాజు,దొమ్మటి రాజేందర్,కర్నె రాజు,తాళ్ల నరేందర్,సతీష్,తదితరులు పాల్గొన్నారు.